నాగర్ కర్నూల్‌కు ఆర్‌ఎస్‌పి.. మెదక్‌కు వెంకట్రామిరెడ్డి

- బిఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మరో రెండు లోక్‌సభ స్థానాలకు బిఆర్ఎస్ తన అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్ సీటుకు మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను, మెదక్‌కు మాజీ ఐఎఎస్ అధికారి, ఎమ్మెల్సీ పి.వెంకట్రామిరెడ్డి పేరును బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఖరారు చేసి, ప్రకటించారు.

ఆ ఎమ్మెల్సీలపై అనర్హత వేటేయండి

- మండలి ఛైర్మన్‌కు బిఆర్ఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, కూసుకుంట్ల దామోదరరెడ్డిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ శాసనసభాపక్షం... శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు గురువారం ఆయనకు పిటిషన్‌ను సమర్పించింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకరరావు, యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఆ పార్టీ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎమ్.రమేశ్‌రెడ్డి తదితరులు ఛైర్మన్‌ను కలిశారు. పిటిషన్‌తో పాటు ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపే ఆధారాలను వారు ఆయనకు సమర్పించారు.

విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన

- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జానకంపల్లిలో ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. ఎల్లారెడ్డి డిఎస్‌పి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తి జానకంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుండార ప్రవీణ్.. తమ పట్ల ప్రవర్తిస్తున్న తీరును పలువురు విద్యార్థినులు షీ టీమ్ దృష్టికి తీసుకెళ్లారు. షీ టీమ్ సమాచారంతో శుక్రవారం గ్రామానికి చేరుకున్న డిఎస్‌పి శ్రీనివాస్ విచారణ చేపట్టగా.. కీచక ఉపాధ్యాయుడి నిర్వాకం బయట పడింది. కొన్ని రోజులుగా ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు తేలింది. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డిఎస్‌పి వెంట ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్, ఎస్‌ఐ రాజు ఉన్నారు.

విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై విచారణేది...?

- డాక్టర్ లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ కొనుగోళ్ల విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కారు ఎందుకు విచారణ జరిపించడం లేదని బిజెపి నేత ఎంపి డాక్టర్ కె లక్ష్మణ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చవకగా వచ్చే విద్యుత్‌ని కాదని కమీషన్ల కోసం ఇతర సంస్థల నుంచి ఎక్కువ ధరతో కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నదని ఆరోపించారు. పిపిఎలు కుదుర్చుకోవాలని గతేడాది అక్టోబర్ ఐదోతేదీన బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్‌టిపిసి లేఖరాస్తే పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ఇదే విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని ప్రశ్నించారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లలో జరిగిన అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. సమావేశంలో మీడియా ఇన్‌చార్జి ఎన్‌వి సుభాష్, అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ పాల్గొన్నారు.

పనికి దూరం

- బీడీ ఆకు సేకరణలో అటవీశాఖ నిర్లక్ష్యం
- కాంట్రాక్టర్లు ముందుకు రాలేదనే సాకు
- రేటు విషయంలో సమన్వయ లోపం
- ఇతర రాష్ట్రాల్లో మొదలైన ప్రూనింగ్
- బిజెపి ప్రభుత్వ ధోరణీ కారణమే..!
- ఏజెన్సీ వాసులకు ఉపాధి లేక ఆర్థిక భారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరి.. రాష్ట్ర అటవీశాఖ నిర్లక్ష్యం వల్ల ఏజెన్సీ వాసులు ఉపాధికి దూరమవుతున్నారు. తునికాకు ద్వారా లభించే ఉపాధి, ఆదాయాలు కోల్పోతున్నారు. ప్రభుత్వాలు సైతం పన్నులు, ఎగుమతుల రూపంలో వచ్చే రెవెన్యూను పొందలేకపోతున్నాయి. అటవీ ప్రయివేటీకరణ నిబంధనలకు తలొగ్గిన కేంద్రం పెద్దపులులు సంచరిస్తున్నాయనే పేరుతో తునికాకు సేకరణను నిలిపివేయాలనే కుట్రపూరిత వైఖరితో వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. కార్మికుల ఉపాధి కొట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేస్తుంటే.. రాష్ట్ర అటవీశాఖ నిర్లక్ష్యం దానికి ఊతమిచ్చే అంశంగా మారుతోందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆరోపిస్తోంది.

అటవీశాఖ నిర్లక్ష్యం.. ఆదివాసీల పాట్లు

అటవీశాఖ నిర్లక్ష్యం ఫలితంగా ఆదివాసీలు ఆదాయ, ఉపాధిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్‌లో నిర్వహించాల్సిన టెండర్లు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేటికీ కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 97 యూనిట్ల టెండర్లు మాత్రమే పూర్తయ్యాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, చివరకు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ టెండర్లు డిసెంబర్ నాటికే పూర్తయ్యాయి. ఒకప్పుడు ఉమ్మడి భద్రాచలం డివిజన్‌లో అంతర్భాగంగా ఉండి ఇప్పుడు ఎపిలో కలిసిన చింతూరు, వీఆర్‌పురం, ఎటపాక యూనిట్లలోనూ టెండర్లు పూర్తయ్యి.. ప్రూనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. కానీ రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచి టెండర్లు మొదలయ్యాయి. రేటు విషయంలో కాంట్రాక్టర్లు, అటవీశాఖకు మధ్య సమన్వయం లోపించడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణంగా ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికీ మూడు దఫాలుగా పిలిచినా టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదనే అటవీశాఖ వాదనను ఆదివాసీ సంఘాలు తప్పు పడుతున్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే రేటు తగ్గించాలి.. గుత్తేదారులు ముందుకు రాబట్టే కదా..! సగం యూనిట్ల టెండర్లు పూర్తి చేయగలిగింది అనే ప్రశ్న లేవనెత్తుతున్నారు.

ఆదివాసీకి హక్కు.. తునికాకు

అటవీహక్కు చట్టం-2006 ప్రకారం ఆదివాసీ గిరిజనులకు తునికాకు సేకరణ చిన్న తరహా అటవీ ఉత్పత్తుల కిందకు వస్తుంది. దీనిద్వారా అటు ఆదివాసీలకు, ఇటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. విదేశీ మారక ద్రవ్యం కూడా ప్రభుత్వానికి అందుతుంది. అటవీ హక్కు చట్ట ప్రకారం తునికాకు సేకరించడం ఆదివాసీల హక్కు. పులుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ సాకుతో ఆకు సేకరణ నిలిపివేయడం ఏమాత్రం సరికాదని ఆదివాసీ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పేరుతో ఆసిఫాబాద్ డివిజన్‌లో కవ్వాల్ టైగర్ జోన్, మైనింగ్ పేరుతో ప్రతియేటా తునికాకు యూనిట్లు తగ్గిస్తూ వస్తున్నారు. గతేడాది కేవలం రెండు యూనిట్లకే టెండర్లు పిలిచారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోనూ 13కు 9 యూనిట్ల టెండర్లే చేశారు. ఈ విధంగా ప్రభుత్వాలు ప్రతియేటా యూనిట్లు, కల్లాలు తగ్గిస్తూ వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం తునికాకు బోనస్‌ను కూడా పెండింగ్‌లో పెడుతోంది. 2016 తునికాకు బోనస్‌పై తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పోరాటాలు నిర్వహించిన ఫలితంగా ఎన్నికల ముందు గత బిఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా కొన్ని చెక్కులు పంపిణీ చేసింది. వేలాది మందికి బోనస్ పెండింగ్‌లో ఉంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వేసవి మూడు నెలల్లో ఒక్కో గిరిజన కూలి సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో గతేడాది కూడా సకాలంలో టెండర్లు చేపట్టకపోవడంతో ఆశించిన లక్ష్యాన్ని చేరలేకపోయింది. 60వేల స్టాండర్డ్ బ్యాగ్‌లకు గాను కేవలం 21,748 బ్యాగ్‌లు మాత్రమే సేకరించారు. ఈ ఏడాది 64,400 స్టాండర్డ్ బ్యాగ్‌లు లక్ష్యంగా నిర్దేశించారు. కానీ ఇప్పటికీ ప్రూనింగ్ ప్రకియ చేపట్టకపోవడంతో ఆకు ముదురుతోందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

అటవీశాఖ నిర్లక్ష్యమే కారణం
బండారు రవికుమార్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అటవీశాఖ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ అటవీ ప్రయివేటీకరణ ఫలితంగా తునికాకు సేకరణ మందకొడిగా సాగుతోంది. మూడు దఫాలుగా పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే మాట అటవీశాఖ నుంచి వినిపిస్తోంది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే సగం యూనిట్ల టెండర్లు ఎలా పూర్తయ్యాయి?. అటవీశాఖ నిర్లక్ష్య ఫలితంగా ఒక్కో ఆదివాసీ కార్మికుడు రూ.30వేలకు పైగా ఆదాయాన్ని కోల్పోతున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పిల్లల చదువుకు వినియోగించే తునికాకు సేకరణ సకాలంలో చేపట్టకపోవడంతో అనేక మంది ఉపాధిని కోల్పోతున్నారు. ఏజెన్సీ వాసులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులపై నేడు నిరసనలు

- వామపక్ష పార్టీల సమావేశం పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులకు వ్యతిరేకం గా శనివారం నిరసన కార్యక్రమాలను చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. వాటిని జయప్రదం చేయాలని కోరాయి. వామపక్ష పార్టీల సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డిజి నరసింహారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(సి) నాయకులు తేజ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కోటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను తీవ్రంగా ఖండించారు. దీన్ని వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. స్వచ్ఛందం గా పనిచేసే సంస్థలైన ఈడీ, ఐటీ, సీబీఐలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నదని తెలిపారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, బిజెపియేతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తోపాటు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలను అరెస్టుల పర్వం కొనసాగించిందని విమర్శించారు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బ్యాంక్ అక్కౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తున్నదని తెలిపారు. ఇలాంటి నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని, శనివారం జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

గులాబీ బోర్డు తొలగింపు

- బిఆర్ఎస్‌కి బై బై చెప్పే సంకేతాలు ఇచ్చిన తెల్లం
- ఇక కార్ స్టీరింగ్ రావులపల్లికే..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం హస్తగతమైనట్టేనా.. అంటే అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మరో అడుగు ముందుకేసి తన క్యాంపు కార్యాలయం ముందు ఉన్న గులాబీ బోర్డులను తొలగించారు. నెలరోజుల నుంచి బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న తెల్లం.. ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలోనూ స్పందించ లేదు. వ్యక్తిగత కారణాలతో బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నానని మీడియా ప్రతినిధులతో స్పష్టత ఇస్తూనే, భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎటువంటి నిర్ణయానికైనా వెనుకాడనని సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన క్యాంపు కార్యాలయానికి ఉన్న గులాబీ రంగు బ్యానర్లను, బోర్డులను తొలగించారు. దీంతో బిఆర్ఎస్ పార్టీకి బై బై చెప్పినట్టేనన్న సంకేతాలు స్పష్టంగా ఇస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారికంగా తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరటానికి కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నప్పటికీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసమే పనిచేస్తారని ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు బహిరంగంగానే చెబుతున్నారు.

కారు స్టీరింగ్ రావులపల్లి చేతికే..?

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బిఆర్ఎస్ పార్టీని వీడతారన్న స్పష్టమైన సంకేతాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ బాధ్యతలను సీనియర్ నేత రావులపల్లి రాంప్రసాద్‌కి అప్పజెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సిపిఐలో భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం.. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కి సమీప బంధువు కావడంతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ తాతా మధుకి అత్యంత నమ్మకస్తుడిగా రావులపల్లికి పేరుంది. రానున్న కాలంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్ష స్థాయిలో పోరాడాలంటే రావులపల్లి రాంప్రసాద్‌కే ఈ నియోజకవర్గ బాధ్యతలు ఇస్తే ప్రజా సమస్యలపై పోరాడేందుకు అవకాశాలు ఎక్కువ లభిస్తాయని ఆ పార్టీ అధినాయకత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద స్థాయిలో గులాబీ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వలస వెళ్లటం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే తిప్పన సిద్దులు వంటి సీనియర్ నేత సైతం ఆ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో ఇటువంటి కష్టకాలంలో పార్టీని నిలబెట్టేందుకు రావులపల్లి రాంప్రసాద్ వంటి సీనియర్ నేత సేవలు వినియోగించుకోక తప్పదని భద్రాచల నియోజకవర్గ ఇన్‌చార్జి.. ఎమ్మెల్సీ తాత మధు నిర్ణయానికి వచ్చి ఆ వైపుగానే అడుగులు వేస్తున్నట్టుగా తెలుస్తుంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల లోపే కారు స్టీరింగ్ రావులపల్లి చేతికి అప్పజెప్పేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తుంది.

నివాళులర్పిస్తున్న శ్రీకాంత్, తదితరులు

కిరణ్ మృతి ఐక్య ఉద్యమాలకు తీరని లోటు

- తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఎఫ్‌టియు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.కిరణ్ మృతి ఐక్య ఉద్యమాలకు తీరని లోటు అని తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్-సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కిరణ్ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన భౌతికకాయాన్ని శ్రీకాంత్‌తోపాటు ఎఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె అజయ్‌బాబు, కోశాధికారి కె.సతీష్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ సందర్శించారు. పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిరణ్ 30 ఏళ్లుగా ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారనీ, ట్రాన్స్‌పోర్ట్ జెఎసి కార్యక్రమంలో కూడా చురుగ్గా పాల్గొంటూ, కార్యక్రమంలో ముందుండే వారని గుర్తు చేశారు. వారి మరణం ట్రాన్స్‌పోర్ట్ ఐక్య ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు.

రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- ఎండిన పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో వందల ఎకరాల్లో పైర్లు ఎండిపోయాయని, ఒకవైపు కరువు, మరోవైపు పాలకుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లోఓల్టేజీ విద్యుత్ కారణంగా మోటర్లు కాలిపోతున్నాయన్నారు. ఒక్కో రైతు ఎకరానికి రూ.25 నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెట్టి ఆగమయ్యారన్నారు. జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉండి కనీసం పంట పొలాలను పరిశీలించిన పాపాన పోలేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు కారుస్తుంటే.. కనీసం వారికి ధైర్యం ఇచ్చే పరిస్థితిలో మంత్రులు లేరని విమర్శించారు. పంటకు మంచి ధర ఇప్పించి.. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పంట నష్టంపై మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు

మే 7 నుంచి ఎప్‌సెట్

- జూన్ 5, 6 తేదీల్లో ఐసెట్
- పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌లో సవరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే తొమ్మిది నుంచి 12 వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఉన్నత విద్యామండలి తొలుత నిర్ణయించింది. మే 13న రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో ఎప్‌సెట్ రాతపరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి మార్చింది. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆర్ లింబాద్రి శుక్రవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను, అదేనెల తొమ్మిది నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. జూన్ నాలుగు, ఐదు తేదీల్లో నిర్వహించే ఐసెట్ రాతపరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేశామని పేర్కొన్నారు. అదేనెల నాలుగున పార్లమెంటు ఎన్నికల ఫలితాలు విడుదల అవుతున్నందున జూన్ ఐదు, ఆరు తేదీల్లో ఐసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

కృష్ణా ట్రిబ్యునల్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భాగస్వామ్య రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఏర్పాటైన కృష్ణా ట్రిబ్యునల్ కాలపరిమితిని వచ్చే సంవత్సరం జులై వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. అలాగే సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖకు లేఖ రాశారు. 2004 ఏప్రిల్ రెండున ఏర్పడిన కృష్ణా ట్రిబ్యునల్ 2010 డిసెంబరు 30న కృష్ణా జలాల పంపిణీపై కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఆ తీర్పుపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వంతోపాటు భాగస్వామ్య రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నదీజలాల వివాదాల చట్టంలోని సెక్షన్ 5(3) కింద 2011 మార్చి 29న దరఖాస్తు చేశాయి. దానిపై విచారణ జరపడానికి కేంద్ర ప్రభుత్వం 2012 నుంచి ప్రతియేటా ట్రిబ్యునల్ గడువును పొడిగిస్తూ వస్తుంది. ఈ మధ్యలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 89ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం 2023 జులై ఆరున కొత్తగా ప్రతిపాదించిన విధివిధానాలపై విచారణ జరిపి, తదుపరి నివేదిక అందించడానికి ట్రిబ్యునల్ పదవీకాలాన్ని ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. తుది నివేదిక ఇవ్వడానికి మరికొంత సమయం కావాలని ట్రిబ్యునల్ విజ్ఞప్తి చేయడంతో 2025 జులై 31వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు హైదరాబాద్ జలసౌదలో ఉన్న కెఆర్ఎంబి కార్యాలయానికి సైతం లేఖ అందింది.

సికింద్రాబాద్‌లో తేలని అభ్యర్థుల ఎంపిక!

- రకరకాల ప్రచారాలు ముందుకు
- బొంతు లేదా దానం నాగేందర్‌కు కాంగ్రెస్ టికెట్
- బిఆర్ఎస్‌లో పద్మారావు, మరో ముగ్గురి పేర్ల పరిశీలన
- లష్కర్‌లో వేయాలని కాంగ్రెస్, బిఆర్ఎస్ గట్టి ప్రయత్నాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్‌లో అభ్యర్థుల ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదు. ప్రధాన పార్టీలైన ఈ రెండూ సికింద్రాబాద్ (లష్కర్)లో ఈసారి ఎలాగైనా పాగా వేయాలని పావులు కదుపుతున్నాయి. మరోసారి గెలిచేందుకు కిషన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లో అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేరు అనూహ్యంగా తెరపైకి రాగా.. మొన్నటివరకు బొంతు, ప్రముఖ విద్యావేత్త విద్యా స్రవంతిలో ఒకరికి ఖచ్చితంగా టికెట్ అని ప్రచారం సాగింది. బీఆర్ఎస్‌లో పద్మారావు, ఎడ్ల సుధాకర్ రెడ్డి, నాయిని అల్లుడు శ్రీనివాస్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇలా రోజుకో పేరు బయటకు వస్తోంది. కాగా, ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. కానీ లష్కర్ అభ్యర్థి ఎవరని, ఎప్పుడు ప్రకటిస్తారోనని చర్చ తీవ్రస్థాయిలో జరుగుతోంది.

కిషన్ రెడ్డికి దీటైన అభ్యర్థి కోసం వెతుకులాట!

సికింద్రాబాద్ నుంచి బిజెపి తరపున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. ఈయన ఇప్పటికే ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇక్కడ బిజెపికి చెక్‌పెట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ భారీ కసరత్తు చేస్తున్నాయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని ఓడించాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉంది. అందుకే అభ్యర్థి ఎంపిక ఆలస్యమైనప్పటికీ. జాగ్రత్తలు తీసుకుంటుందని ఆ పార్టీ నేత ఒకరు చెప్పారు. బిఆర్ఎస్ సైతం అదే ఆలోచనలో ఉన్నప్పటికీ.. కవిత లిక్కర్ స్కాం, ఇడి అరెస్టు నేపథ్యంలో బిఆర్ఎస్ వైఖరిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరు పార్టీల అభ్యర్థి ఎంపికలో రోజుకో మలుపు

కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక విషయంలో రోజుకో మలుపు తిరుగుతోంది. రోజుకో పేరు అధిష్టానం పరిశీలనలో ఉన్నాయంటూ అటు కాంగ్రెస్.. ఇటు బిఆర్ఎస్‌లో ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. మొన్నటి వరకు సికింద్రాబాద్ కాంగ్రెస్ సీటు జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కే అని ఊహాగానాలు వెలువడటమే కాదు.. ఆయన ప్రచారం సైతం చేసుకున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా దానం పేరు జాబితాలో ఉందని లీకులు ఇస్తుండటంతో కార్యకర్తల్లో గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బిఆర్ఎస్ పార్టీలోనూ ఇదే సీన్. కొన్నిరోజుల వరకు తలసాని ఫ్యామిలీకే అని ప్రచారం చేశారు. తీరా ఇప్పుడు పద్మారావు గౌడ్ లేదా వారి ఫ్యామిలీలో ఒకరికి టికెట్ ఖచ్చితమని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ మేరకు చర్చలు కూడా జరిగాయి. ఒకవేళ పద్మారావు గౌడ్ ఎన్నికల్లో పోటీకి సుముఖత చూపని పక్షంలో అంబర్‌పేట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి, మాజీ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి అల్లుడు రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పేర్లను బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీల్లో ప్రస్తుత ప్రతిపాదిత అభ్యర్థులే ఉంటారని, అందులో ఎవరుంటారనే దానిపై స్పష్టతకు మాత్రం మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

హార్టికల్చర్ భూముల్లో హైకోర్టు భవన నిర్మాణం

- వనమూలికలు, మొక్కలు ధ్వంసం
- యూనివర్సిటీ భూములు ఇవ్వొద్దంటూ విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్, హార్టికల్చర్ యూనివర్సిటీలోని భూమిలో హైకోర్టు భవన నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒను విడుదల చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం జెసిబిలతో చదును చేశారు. ఈ భూమిలో ఉన్న విలువైన వనమూలికలు, ఔషధ మొక్కలను ధ్వంసం చేస్తూ పూర్తిగా నేలను చదును చేస్తున్నారు. బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గర ఉండటంతో ప్రభుత్వం ఇక్కడ హైకోర్టు భవనాన్ని నిర్మిస్తే.. అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించి యూనివర్సిటీ భూములను కేటాయించింది. విద్యార్థుల పరిశోధనలు చేయడానికి ఉపయోగపడే ఈ భూమిని ఎట్టి పరిస్థితిల్లోనూ హైకోర్టుకు ఇవ్వరాదని హార్టికల్చర్ విద్యార్థులు సుమారు 60 రోజులకుపైగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కానీ, ప్రభుత్వం స్పందించలేదు. యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మించరాదని భవిష్యత్‌లో యూనివర్సిటీ ఉనికికే ప్రమాదం ఉందని ప్రతిపక్ష పార్టీలన్నీ విద్యార్థులకు మద్దతు తెలిపాయి. అయినా ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం గురువారం భూమిని పూర్తిగా చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఈ పనులు చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు మాత్రం ఇక్కడ హైకోర్టు నిర్మించరాదని మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను తెరిపించాలి

- కార్మికులకు ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షోభంలోకి కూరుకుపోయి రెండునెలలుగా మూతపడ్డ సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని సిఐటియు డిమాండ్ చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం టెస్కో ద్వారా కార్మికులకు ఇవ్వాల్సిన రూ.485.89 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసేలా సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అక్కడి కార్మికులకు ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమ మూతతో ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఈనెల 11న సిరిసిల్లలో తడుక శ్రీనివాస్ (42) అనే పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నెల నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నా రాష్ట్ర సర్కారు పట్టించుకోకపోవడం సరిగాదని పేర్కొన్నారు. వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు పెండింగ్ బిల్లులు ఇప్పించడంతో పాటు గిరిజన, బిసి వెల్ఫేర్ గురుకులాలు, ఆర్‌విఎం, కెజిబివి, ఆస్పత్రులకు, ఇతర శాఖలకు అవసరమయ్యే వస్త్రాల ఆర్డర్లను టెస్కో ద్వారా సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

కెకె నివాసానికి దీపాదాస్ మున్షీ

- పార్టీ మారతారని ప్రచారం?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కలిశారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కెకె నివాసానికి ఆమెతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి వెళ్లారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన రాజకీయ చర్చల్లో జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు సాగుతున్న సమయంలో కెకె ను కాంగ్రెస్ నేతలు కలవడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. కెకెతో పాటు ఆయన కూతురు, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కూడా పార్టీ మారే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్న సంగతి తెలిసిందే. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మెన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హస్తం పార్టీలో చేరి లోక్‌సభ టికెట్లు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో కెకె, మేయర్ విజయలక్ష్మి కూడా కాంగ్రెస్ నేతలతో మంతనాలు గమనార్హం.

భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి

- 174 సర్వే నెంబర్ భూమిని పేదలకు పంచాలి : బి వెంకట్
- గుడిసెవాసులకు పట్టాలివ్వాలి : జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్ల గ్రామ శివారులో ఉన్న 174 సర్వే నెంబర్‌లో 8-16గుంటల భూమిని బిఆర్‌ఎస్ నాయకుడు, జడ్‌పి చైర్‌పర్సన్ అంజయ్య కబ్జా చేసి రెవెన్యూ అధికారులను, హైకోర్టును తప్పుదోవ పట్టించి ఆ భూమిపై స్టేటస్కో ఆర్డర్ తీసుకొచ్చారని తెలిపారు.కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసి.. భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. 174 సర్వే నెంబర్ భూమిలో సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బృందం కలిసింది. స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా బి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జాలు చేసి ఆక్రమించు కుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకపక్క కేసులు ఎత్తేస్తామని చెప్తూనే గుడిసెవాసులపై, సిపిఎం నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపడం కుతిల బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య మాట్లాడుతూ 174సర్వే నంబర్‌పై ఉన్న స్టేటస్కోను రద్దు చేస్తూ జిల్లా రెవెన్యూ కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని తహసీల్దార్ జిల్లా కోర్టుకు అందించడంలో కాలయాపన చేశారన్నారు. ఇది పరోక్షంగా భూకబ్జాదారు లకు సపోర్టు చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్ల స్థలాల సమస్య ఉండదని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వడంలో విఫలమైంద న్నారు. గుడిసెల స్థలాలకు పట్టాలు ఇచ్చి.. ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలం.. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, భూ పోరాట కమిటీ కన్వీనర్ పర్వత నరసింహులు, నాయకులు గొల్లపల్లి బాపురెడ్డి, రామగల అశోక్, అనెబోయిన శ్రీను, తాడెం రాములు అన్నెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బృందం

సిఎంకు రాసిన లేఖ ప్రతిని పవన్‌కుమార్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలి

- సిఎంకు ఎమ్మెల్యే తలసాని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జిహెచ్ఎంసి డివిజన్లతో కూడిన సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌కు శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. తమ ఉద్యమానికి మద్దతు తెలుపుతూ జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్ రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు అశోక్, కృష్ణ సాగర్ ముదిరాజ్, సునీల్, జగ్గయ్య ఉన్నారు.

ఆర్‌టిసి కార్మికుల బాండ్ల డబ్బులు చెల్లించేలా చూడండి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎస్‌డబ్ల్యుయు నేతల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు బాండ్ల డబ్బులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుయు (ఐఎన్‌టియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీ జి అబ్రహం, కెటి రెడ్డి, డివిఎస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పూలే భవన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తగ్గించిన హెచ్ఆర్ఎను అమలు చేయడాన్ని ఆపాలని కోరారు. బాండ్ల డబ్బుల విషయంలో జాప్యానికి కారణాలు తెలుసుకుని చెల్లించే విధంగా చూస్తానని వారికి డిప్యూటీ సిఎం హామీనిచ్చారు. 1-4-2020 నుంచి హెచ్ఆర్ఎను తగ్గింపు నిలుపుదల అంశంపై ఎన్నికల కోడ్ ఉన్నందున తర్వాత ఆలోచిస్తామని తెలిపారు.

కోల్డ్ స్టోరేజీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మిర్చి రైతుల ధర్నా

- పోలీసుల మధ్యవర్తిత్వంతో ముగిసిన వివాదం
- కోల్డ్ స్టోరేజీలో మిర్చి నిల్వ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని చామండి కోల్డ్ స్టోరేజ్ ముందు శుక్రవారం మిర్చి రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మిర్చి పంటకు సరైన ధర లేకపోవడంతో మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలలో నిలువ చేసుకుందామంటే వ్యాపారులు అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీదుదారులు కోల్డ్ స్టోరేజీలను ఆక్రమించుకొని రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కమీషన్లకు ఆశపడి రైతుల మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుకోవడం లేదని, ఈ దోపిడీని అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఏనుమాముల పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కోల్డ్ స్టోరేజ్ యజమానులతో మాట్లాడి సుమారు రెండు వేల మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టించడంతో రైతులు శాంతించారు.

మార్కెట్‌కు మూడ్రోజుల సెలవు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నేటి నుంచి మూడ్రోజులపాటు సెలవు ఉంటుందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం (నేడు) వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం హోలీ పండుగ సందర్భం గా మొత్తం మూడ్రోజులపాటు సెలవు ఉంటుందని చెప్పారు. మంగళవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్
- బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించిన ఆప్ నాయకులు
- అరెస్టు చేసిన పోలీసులు

ఆందోళన చేస్తున్న ఆప్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్రలేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. 'మోడీ హటావ్ - దేశ్ బచావ్', 'బిజెపి విభజన రాజకీయాలు సిగ్గుచేటు', 'బిజెపి భారత్ చోడో', 'పిఎం కేర్ ఫండ్స్, రాఫెల్ డీల్ డీమోనిటైజేషన్', 'బిజెపిని గద్దె దించాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసుకుంటూ బిజెపి రాష్ట్ర కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తతకంగా మారడంతో పోలీసులు అడ్డుకొని బలవంతంగా డాక్టర్ దిడ్డి సుధాకర్‌తోపాటు ఆప్ శ్రేణులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి చేతిలో ఉండి ప్రతిపక్ష నేతల అణచివేతకు ప్రధాన సాధనాలుగా మారాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తర భారత దేశంలో ఆప్ బలాన్ని చూసి భయంతోనే.. ప్రధాని మోడీ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని, దీని వెనుక బిజెపి హస్తం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేటాడేందుకు ఉపయోగించుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రతిపక్షం, ప్రజాస్వామ్యం గొంతును అణచివేయడానికి మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా అన్సారీ, ఎంఎ మజీద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, అధికార ప్రతినిధులు జావీద్, అక్షయ్, నేతలు మదన్ లాల్, హైదర్, టి రాకేష్ సింగ్, మౌనిక పాల్గొన్నారు.

వేదికపై మాట్లాడుతున్న ప్రొ కోదండరామ్

రాజకీయ కక్షలో భాగమే కేజ్రీవాల్ అరెస్ట్

- టిజెఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్
- విద్యారంగంపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి : హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే న ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని టిజెఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ అన్నారు. గుజరాత్‌లో నేరాలు చేసిన వారికి మాత్రం నిర్దోషులుగా క్షమాభిక్ష పెడుతున్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 'ఉద్యమ ఆకాంక్షలు, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ కర్తవ్యాలు' అనే అంశంపై కోదండరామ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధ్యాపకులు, యూనివర్సిటీ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని, అన్ని యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య నినాదానికే పరిమితమైందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో విద్యారంగం బలోపేతం అవుతుందనే నమ్మకం ఉందన్నారు.

పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విద్యారంగంపై సామాజిక దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తే సామాన్యులలో ప్రశ్నించేతత్వం పెరుగుతుందనే దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. యుజిసికి ఏటా రూ.ఆరు వేల కోట్లు కేటాయించేవారని, వాటిని రూ.రెండు వేల కోట్లకు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ విద్యారంగానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుం దన్నారు. అందుకోసం విద్యార్థి సంఘాలు, మేధావులు కూడా సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టివివి నగర ఉపాధ్యక్షులు డాక్టర్ ఇ ఉపేందర్, ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు చేశారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. వరంగల్ జిల్లా ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన గూడగంటి హరీష్ తాను కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించారు. రూ.19200 లంచంగా ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, ఆపరేటర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో హరీష్ ఎసిబి అధికారులను ఆశ్రయించగా, వారు ఆకస్మిక దాడి చేశారు. హరీష్ నుంచి రూ.19200 లంచంగా తీసుకున్న వెంకటేష్ తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఎసిబి అధికారు లు తనిఖీలు నిర్వహించగా దస్తావేజు లేక రిజిస్ట్రేషన్ కోసమిచ్చిన రూ. 1,72,000 పట్టుబడ్డాయి. ఆ సొమ్మును కూడా సీజ్ చేసి తహసీల్దార్‌ను ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

మాదిగలను మోసం చేసిన బిజెపి, బిఆర్‌ఎస్ : ఎఐసిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు పదేళ్లపాటు మాదిగలను మోసం చేశాయని ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ సంపత్ కుమార్ విమర్శించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి హైదరాబాద్‌లోని సంపత్ కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం వారిద్దరూ సిఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంపత్ కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం కాంగ్రెస్ హయాంలో ఉషామెహ్రా కమిషన్‌ను వేసిన విషయాన్ని గుర్తుచేశారు. తనకు టికెట్ రాలేదనే బాధ లేదని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం మాదిగల హక్కులను మందకృష్ణ మాదిగ ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మాదిగలకు ఎప్పుడు అన్యాయం జరిగినా అధిష్టానానికి లేఖ రాస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లో తెలంగాణ లేబర్ పార్టీ విలీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ లేబర్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో లేబర్ పార్టీ అధ్యక్షులు రమేశ్, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

25 నుంచి నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి కల్చరల్

ప్రముఖ నాటక సంస్థ రసరంజని 31వ వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 25 నుంచి 27 వరకు మూడ్రోజులు రవీంద్ర భారతి ప్రధాన వేదికపై నాటక ప్రదర్శన జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను సంస్థ అధ్యక్షులు డాక్టర్ కెవి రమణ మాసబ్ టాంక్ వద్దనున్న అయన నివాస కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు.

రస రంజని నాటక సంస్థ తెలుగు నాటకాన్ని పదిల పరుస్తూ రాబోయే తరాలకు అందించాలన్న లక్ష్యం తో హెచ్‌జె దోర, జెవి.సోమయాజులు, రమణమూర్తి, చాట్ల శ్రీరాములు, దుగ్గిరాల సోమేశ్వరరావు, గరిమెళ్ల రామమూర్తి వంటి మహామహులతో 30 సంవత్సరాల క్రితం ఆరంభించారని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగా యువ రంగస్థల పురస్కారం ఈ సారి బహూకరించేందుకు 35 ఏళ్ల లోపు తగిన అభ్యర్థి తమ పరిశీలనకు రాలేదని రాబోయే ఏడు 40 ఏళ్లకు వయస్సు పెంచి 2024కు 2025 కు ఒకేసారి ఇస్తామని ప్రకటించారు. సంస్థ కార్యదర్శి ముట్నూరు కామేశ్వర రావు మాట్లాడుతూ యువ రంగస్థల పురస్కారంగా పాతిక వేల నగదును బహుకరిస్తున్నట్లు తెలిపారు పత్రిక సమావేశంలో కోశాధికారి మోహన్ సేనాపతి, సభ్యులు వెంపటి రాధా కృష్ణ, తంగిరాల అరుణ్ తదితరులు పాల్గొన్నారు

హిమాయత్ నగర్‌లో రైజింగ్ సన్ కొత్త సెంటర్

హైదరాబాద్ : ఆటిజం, ఎడిహెచ్‌డి, మేధోపరమైన వైకల్యం, ప్రవర్తనా పరమైన సమస్యలతో బాధపడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు తగిన సేవలందించే రైజింగ్ సన్ డెవలప్‌మెంట్ సెంటర్ తమ నూతన శాఖను హిమాయత్‌నగర్‌లో ప్రారంభించింది. ఈ సెంటర్‌లో బిహేవియర్ థెరఫీ, ఫిజియోథెరఫీ, సెన్సరీ ఇంటిగ్రేషన్, స్పెషల్ ఎడ్యుకేషన్ సహా కౌమార దశ పిల్లలకు కౌన్సిలింగ్, సైకాలజికల్ సమస్యలకు తగిన పరిష్కారాలను కూడా అందించనున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకులు శ్వేత దేశిరాజు పేర్కొన్నారు.

ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలి

- మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బిజెపి భారీ కుంభకోణానికి పాల్పడిందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపు నిచ్చారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీ కూడా ఆదాయ పన్ను కట్టిన చరిత్ర లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను సీజ్ చేసి డబ్బులు వాడుకోకుండా బిజెపి కుట్రలు చేసిందని ఆరోపించారు. పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి కార్పొరేట్ సంస్థలను లాభం చేకూర్చిన ఆ పార్టీ.... మతం, దేవుళ్ళ, అక్షింతల పేరుతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

భద్రతా ప్రమాణాలను పాటించండి

- దక్షిణ మధ్య రైల్వే జిఎం జైన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఎకె జైన్ సిబ్బంది, అధికారులకు సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జోన్‌వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలన, పలు ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనంజయులుతో పాటు అన్ని శాఖల ప్రిన్సిపల్ హెడ్స్‌తో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డిఆర్ఎం) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాలని, లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డులు తదితరులంతా భద్రతా సంబంధిత సిబ్బందికి తరచుగా క్షేత్ర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాలు తదితర అగ్నిమాపక నిరోధక భద్రతా వస్తువుల లభ్యతను సైతం సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రయాణీకుల భద్రత కోసం నాన్-ఇంటర్‌లాకింగ్ లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద వాయిస్ లాగర్ సౌకర్యాలను కల్పించడంపై కూడా ఆయన నొక్కి చెప్పారు. తదనంతరం మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైలు సమయపాలనపై చర్చించుతూ, ట్రాక్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకొని సమయపాలనను మెరుగుపరచుకోవాలని అధికారులకు సూచించారు. రైలు కార్యకలాపాలలో జోన్ సమయపాలన గణనీయమైన మెరుగుదలకు సాక్ష్యమిచ్చేలా సగటు వేగాన్ని మెరుగుపరచడానికి కచ్చితమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రన్నింగ్ స్టాఫ్ పనివేళలపై సమీక్షించి, సిబ్బందికి తమ విధులను సజావుగా నిర్వహించేందుకు, సురక్షితమైన పని పరిస్థితులు ఉండేలా పనివేళలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సరకు లోడింగ్, అన్‌లోడ్ చేయడానికి అదనపు లూప్ లైన్ల ఏర్పాటు, హాల్ట్ స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్‌లుగా మార్చడం, పొడవైన లూప్ లైన్ల ఏర్పాటు వంటి ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిని కూడా సమీక్షించారు. నిర్దేశిత సమయానికి ముందే పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని డివిజినల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అమృత్ స్టేషన్ల ప్యాసింజర్ సౌకర్యాలు పునరాభివృద్ధి పనులకు సంబంధించి జరుగుతున్న అభివద్ధి పనుల స్థితిగతులపై డివిజనల్ రైల్వే మేనేజర్లతో చర్చించారు.

పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలవాలి

- బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఎవరికీ భయపడరు
- పేదల ఇళ్లపై బుల్డోజర్స్ ఎక్కుపెట్టిన ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ గెలుపు చారిత్రక అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. మల్కాజిగిరి పార్లమెంటులోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల మేయర్లు, నాయకులు ఉన్నారన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా నిలిపి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత మేయర్, పాలకవర్గానికే దక్కుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ బలంగా ఉందని.. ప్రత్యర్థులకు కనీసం క్యాడర్ లేదు, నాయకుడు లేడు, బూత్ ఏజెంట్ కూడా లేడని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికులని.. ఎవరికీ భయపడరని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి 100 రోజులైనా ప్రజలకు ఇచ్చిన హామీలలో నెరవేర్చించింది శూన్యం అని విమర్శించారు. కూల్చడంలో నెంబర్ వన్ ప్రభుత్వం కాంగ్రెస్ అని.. అందుకే గెలిచిన వెంటనే పేదల ఇండ్లపై బుల్డోజర్స్ ఎక్కుపెట్టిందని విమర్శించారు. మల్కాజిగిరిలో బిఆర్‌ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో అనేక సేవా కార్యక్రమాలు చేశానని, సేవా దృక్పథం, నిబద్ధతను చూసి బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ఎంపి అభ్యర్థిగా అవకాశం కల్పించారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండని అభ్యర్థులకు ఓటు వేయవద్దని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే కొట్లాటలు పెట్టే పార్టీలను ఆదరించొద్దని అన్నారు. ఢిల్లీ పార్టీలను వదిలి తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయలని కోరారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్, మల్లారెడ్డి నాయకత్వంలో తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి తన చారిటీ ట్రస్ట్ ద్వారా పేదలకు అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో లక్ష్మారెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి, కేసిఆర్ కేటీఆర్‌లకు గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మద్ది యుగేందర్ రెడ్డి, కౌడే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, ఎంపల్ల అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి,కో ఆప్షన్ ఇర్ఫాన్, నాయకులు బైటింటి ఈశ్వర్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, బండారి రవీందర్, బండి సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.